ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 08.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఇండి కూటమి ఈరోజు 'చలో లోక్ భవన్' ర్యాలీ నిర్వహించింది.

2. యువతలోని నైపుణ్యం, ప్రతిభే తెలంగాణకు అతిపెద్ద బలమని ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

3. ఎస్ఐఆర్ అంశం సుప్రీంకోర్టులో విచారణ జరు గుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ రాజ్యాంగ వ్యవస్థల ప్రక్రియను గౌరవించాలని తెలంగాణ బీజేపీ అధికార ప్రతినిధి సుభాష్ తెలిపారు.

4. దసరా పండగ రద్దీ దృష్ట్యా తెలంగాణ ఆర్టీసీ ఏడు వేలకు పైగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది.

**చలో లోక్ భవన్**

ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఇండి కూటమి, టీపీసీసీ ఆధ్వర్యంలో 'చలో లోక్ భవన్' ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ , ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్

రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామిలతో పాటు సీపీఎం, సీపీఐ, టీజేఎస్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడాలని నినాదాలు చేస్తూ సాగిన ర్యాలీ రాజ్‌భవన్‌కు చేరుకోగానే పోలీసులు మోహరించి అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరగడంతో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు.

డెస్క్

**దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

యువతలోని నైపుణ్యం, ప్రతిభే తెలంగాణకు అతిపెద్ద బలమని ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో జరిగిన డీఈ షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సాంకేతిక , ఆర్థిక సేవలు , గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానంగా మారిందన్నారు. 1996లో హైదరాబాద్‌లో ప్రారంభమైన డీఈ షా వృద్ధి నగరంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. నియోపోలిస్‌లో ఏర్పాటు చేస్తున్న సంస్థ కొత్త కార్యాలయానికి స్వాగతం పలుకుతూ , రాష్ట్రంలో ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు.

డెస్క్

**రేవంత్ రెడ్డి**

దేశంలో ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రధా నమంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియను కొనసాగిస్తోందని , ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు పరిరక్షణకు , ప్రతిపక్ష నేతలపై అణచివేతకు వ్యతిరేకంగా వీధుల నుండి పార్లమెంట్ వరకు పోరాడతామని

స్పష్టం చేశారు. ఈ ఉద్యమం కేవలం కాంగ్రెస్ ది కాదని , ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఇండియా కూటమి, ప్రజల ఉద్యమమని తెలిపారు.

డెస్క్

**హరీశ్‌రావు**

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం నెలకొందని BRS శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు విమర్శించారు. 5,420 కోట్ల రూపాయల ట్రూ అప్ ఛార్జీల భారం , కరెంటు కోతలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యలను ఆయన ఖండించారు. యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులు ఉన్నాయన్న విషయాన్ని గుర్తు చేస్తూ , ప్రజలపై మోపిన ఛార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని , కోతలు లేకుండా చూడాలని కోరారు.

డెస్క్

**జయప్రకాశ్ నారాయణ్**

లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటం , సామాజిక సంస్కరణల కోసం జయప్రకాశ్ నారాయణ్ చేసిన కృషిని స్మరించుకున్నారు. ప్రజాస్వామ్యం , సామాజిక న్యాయం, ప్రజాసేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత , ఆదర్శాలు భావితరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని గవర్నర్ పేర్కొన్నారు.

డెస్క్

**ఓంకారేశ్వర స్వామి**

మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలోని వీరభద్రస్వామి గుట్టపై రూ.1,108.27 కోట్లతో ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో ప్రధాన ఆలయానికి రూ. 598.98 కోట్లు, అనుబంధ అభివృద్ధి పనులకు రూ. 349.67 కోట్లు, మూసీ ఒడ్డున రోడ్డు నిర్మాణానికి రూ.159.62 కోట్లు కేటాయిస్తూ పురపాలకశాఖ ప్రత్యేక

ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డెస్క్

**హైస్పీడ్ రైల్ కారిడార్**

హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్‌లో భాగంగా అచ్చంపేట మండలంలో ఎలివేటెడ్ కారిడార్, సబ్ స్టేషన్ నిర్మాణాల స్థలాలను ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ , కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించారు. ఈ బుల్లెట్ ట్రెన్ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్-బెంగళూరు ప్రయాణ సమయం రెండు గంటలకు తగ్గుతుందని, ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు.

పిటిసి, నాగర్ కర్నూల్

**SATELLITE COMMUNICATION**

దేశంలో శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల నియంత్రణ విధానం పక్షపాతంగా ఉందంటూ సామాజిక మాధ్యమంలో ప్రచారమవుతున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. దేశంలో ఉపగ్రహ ప్రసారాలతో సహా అన్ని టెలికాం సేవలకు నిష్పాక్షికమైన, సమానమైన అనుమతుల విధానాన్ని అమలు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విధానం కింద ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ సేవల కోసం 'గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్ బై శాటిలైట్' విభాగంలో ఇప్పటి వరకు మూడు సంస్థలకు లైసెన్సులు మంజూరు చేసినట్లు తెలిపింది. ప్రస్తుతం లైసెన్స్ పొందిన ఆ మూడు సంస్థల భద్రతా తనిఖీల ప్రక్రియ కొనసాగుతోందని కేంద్రం వెల్లడించింది. ఏ సంస్థకైతే ఈ భద్రతా పరిశీలన పూర్తవుతుందో, ఆ సంస్థ స్పెక్ట్రమ్ కేటాయింపుల తదుపరి దశకు వెళ్తుందని స్పష్టం చేసింది. ఈ మూడు సంస్థలు ప్రస్తుతం ఒకే విధమైన నియంత్రణ దశలో ఉన్నాయని... కాబట్టి ఈ విధానం వివక్షతో కూడుకుని ఉందనడం పూర్తిగా అవాస్తవమని పేర్కొంది.

PIB

**ఎస్.వి.సుభాష్**

భారత్‌లో బంగ్లాదేశ్ వంటి రాజకీయ అస్థిరతను సృష్టించేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని తెలంగాణ బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం ప్రతిపక్షాలు రోడ్లెక్కి నిరసనలు తెలపడాన్ని తప్పుపట్టారు. ఎస్ఐఆర్ అంశంపై  సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్నందున రాజ్యాంగ వ్యవస్థల ప్రక్రియను గౌరవించాలని,  వీధి పోరాటాల ద్వారా వ్యవస్థలను బలహీనపరచవద్దని సుభాష్ హితవు పలికారు.

డెస్క్

**ప్రత్యేక బస్సులు**

దసరా పండగ రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ఏడు వేలకుపైగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. వివిధ జోన్ల నుంచి అక్టోబరు 9, 10, 16, 17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణానికి 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల నుండి ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. పాత జీవో ప్రకారం అదనపు ఛార్జీలు వర్తిస్తాయని , సాధారణ, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం యథావిధిగా కొనసాగుతుందని ఆర్టీసీ తెలిపింది.

డెస్క్

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలో ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ పరిశీలకులు యోగిత రానా, కలెక్టర్ హరిత కాగజ్‌నగర్, జిల్లా కేంద్రంలో సమావేశాలు నిర్వహించారు. ఇప్పటి వరకు 90.3 శాతం హియరింగ్ పూర్తయిందని , మిగిలిన ఓటర్ల ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి పది రోజుల్లో తుది ముసాయిదా జాబితాను విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

పిటిసి, ఆసిఫాబాద్

**ఇండియా పోస్ట్**

తెలంగాణ సర్కిల్ ముఖ్య తపాలా జనరల్ హైదరాబాద్ కార్యాలయం ద్వారా ఇండియా పోస్ట్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి ఈనెల 23 మధ్యాహ్నం 12 గంటలకు ఆన్‌లైన్ డాక్ అదాలత్ నిర్వహించబడుతుంది. సేవలకు సంబంధించిన సమస్యలను ఈ నెల 14.సాయంత్రం 5:45 లోపు తపాలా లేదా ఇమెయిల్ ద్వారా పంపవచ్చు.

డెస్క్

**ETCA**

ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ( ETCA) ఆధ్వర్యంలో దుబాయ్‌లో అక్టోబర్ 11న జరిగే బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం పాల్గొననుంది. శబాబ్ అల్ అహ్లీ స్పోర్ట్స్ క్లబ్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

డెస్క్

**టీపీసీసీ అధ్యక్షుడు**

తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో TWU కూటమికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గౌలిగూడా సెంట్రల్ బస్ స్టేషన్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ , బాణం గుర్తు అభ్యర్థులను గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రయోజనాల పరిరక్షణకు , సమస్యల పరిష్కారానికి కూటమి విజయం అవసరమని పేర్కొన్నారు.

డెస్క్

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఈనెల 11న నిర్వహించే 12వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌నకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 33 జిల్లాల నుంచి 1500 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు.

పిటిసి, ఆసిఫాబాద్

**GWMC**

పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. జీడబ్ల్యూఎంసీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో వినాయక కాలనీలో నిర్వహించిన సామూహిక మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పిటిసి, వరంగల్

**నల్లగొండ కలెక్టర్**

నల్లగొండ జిల్లాలో 2026-27 సంవత్సరానికి మద్దతు ధరకు పత్తి కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్‌లో దాదాపు 3.56 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనాతో 26 జిన్నింగ్ మిల్లులు, 10 సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

పిటిసి, నల్గొండ

**చాడ వెంకటరెడ్డి**

ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని సిపిఐ నాయకుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్ల కార్మిక భవనంలో మాట్లాడిన ఆయన, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన కమిషన్ ద్వారా ఓట్ల చోరీ జరుగుతోందని విమర్శించారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల